ప్రమాదాలకు నెలవులు.. లీకుల గుంతలు

- ఆరు నెలలుగా పరిష్కారం కాని సమస్య
- ప్రధాన రహదారి వెంబడి ప్రమాదభరితంగా గుంతలు



రింగురోడ్డు సెంటర్‌లో పైప్‌లైన్ లీకేజ్‌తో ప్రధాన రహదారి పక్కనే ఏర్పడిన గుంత

రేపల్లె రూరల్: పట్టణంలో మున్సిపల్ ప్రధాన పైపులైన్‌లకు తరచూ ఏర్పడుతున్న లీకులతో తాగునీరు వృధాగా పోవటంతో పాటు ఆయా ప్రాంతాలలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన పైపులైన్‌లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో పట్టణంలో ఏదోక ప్రాంతంలో లీకేజీలు ఏర్పడటం పరిపాటిగా మారుతోంది. ప్రధాన రహదారి వెంబడి ఏర్పడుతున్న లీకులను సరిచేయటంలో మున్సిపల్ అధికారులు విఫలం చెందుతున్నారు. నెలల తరబడి లీకులు అలాగే ఉండటంతో ఆయా ప్రాంతాలలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాద భరితంగా మారుతున్నాయి. ప్రధాన రహదారి కావటం, నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించటంతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ప్రమాదాల బారిన పడే అవకాశాలు నెలకొన్నాయి. రైల్వేస్టేషన్, ఓల్డ్‌టౌన్ ప్రధాన రహదారిలోని బ్రోకర్ ఆఫీసు సెంటర్ నుంచి మసీదు సెంటర్ వరకు పలుచోట్ల ఏర్పడిన లీకులతో ప్రధాన రహదారి వెంబడి భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాలలో లీకులను సరిచేస్తున్నా మరుసటి రోజు మరలా లీకులు ఏర్పడుతున్నాయి. గత ఆరు నెలల నుంచి ఈ లీకుల సమస్య ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా మున్సిపల్ సిబ్బంది లీకులను సరిచేసేందుకు తవ్విన గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

నిత్యం రద్దీగా ఉండే రహదారులలో పదే పదే లీకులు ఏర్పడటం, సిబ్బంది మరమ్మతులు నిర్వహించినప్పటికీ మరలా లీకులు ఏర్పడటం, ఆయా గుంతలు ప్రమాదభరితంగా మారటంతో ఇబ్బందులు తప్పటం లేదు. రాత్రి సమయంలో ఆయా ప్రాంతాలలో ఆదమరచి ప్రయాణం చేస్తే ప్రమాదాల బారిన పడటం తప్పదని ప్రజలు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. లీకుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటంతో పాటు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా ఏర్పడిన గుంత



పద్మశాలీయ కల్యాణ మండపం సమీపంలో ఏర్పడిన గుంత

నిధులు మంజూరయ్యాయి



పట్టణంలో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్‌లు కావటంతో నిత్యం మరమ్మతులకు గురై లీకులు ఏర్పడుతున్నాయి. లీకులను సరిచేసినా మరలా సమస్య ఉత్పన్నమవుతోంది. పాతపైపులను తొలగించి పట్టణంలో 34 కిలోమీటర్ల మేర మెయిన్ పైపులైన్‌ల ఏర్పాటుకు అమృత్ భారత్ పథకంలో రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియలో ఉంది. త్వరలో లీకుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

ఆర్టీసీ డిపో అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్‌బాబు



డిపో మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు

రేపల్లె రూరల్: రేపల్లె ఆర్టీసీ డిపో అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు డిపో మేనేజర్‌ను కోరారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. డిపోలో కాలం చెల్లిన ఆర్డినరీ బస్సులు అనేకం ఉన్నాయని, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే సమయంలో మధ్యలోనే ఆగిపోతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. రేపల్లె – గుంటూరు, రేపల్లె – విజయవాడ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొన్ని సందర్భాల్లో రద్దవుతున్నాయని, ఆ సమయంలో మరొక బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. రేపల్లె డిపో నుంచి దూర ప్రాంతాలకు సర్వీసులను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారి 216 పూర్తి స్థాయి నిర్మాణం జరిగాక దూర ప్రాంత సర్వీసులు ఆ రహదారిపై నడిచే అవకాశం ఉందని, ఆయా సర్వీసులు రేపల్లె డిపోలో నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం, ఏలూరు, రాజమండ్రి నుంచి నెల్లూరు, ఒంగోలు, తిరుపతి వెళ్లే సర్వీసులు రేపల్లె డిపోలో ఆగే విధంగా ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. కార్యక్రమంలో కొడాలి ఆనందరాబు, కె.సాంబశివరావు, కొల్లూరు సాంబశివరావు, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల



బూరుగలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి సద్ది నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

రేపల్లె రూరల్: మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత బూరుగలమ్మ అమ్మవారి తిరునాళ్ల, 13వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురువుకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాలు, పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, సద్ది నైవేద్యాల సమర్పణ తదితర పూజా కార్యక్రమాలతో పాటు 108 బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమలు, పువ్వులు, పండ్లు, నూతన వస్త్రాలు, సద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు ఏర్పాటు చేసిన ప్రభ చూపరులను ఆకట్టుకుంది. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.



బూరుగులమ్మ అమ్మవారు

రేషన్ బియ్యం సక్రమంగా అందజేయాలి



మాట్లాడుతున్న జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి విలియమ్స్

అమర్తలూరు(వేమూరు): రేషన్ బియ్యం పంపిణీ విధానంపై ప్రభుత్వం సర్వే చేయడం జరుగుతుందని సివిల్ సప్లయిస్ బాపట్ల జిల్లా అధికారి విలియమ్స్ అన్నారు. అమర్తలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మధ్యాహ్న భోజన పథకం ఆపరేటర్లు, సివిల్ సప్లయిస్ పాయింట్ ఇన్‌చార్జిలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ విధానంపై సర్వే చేయడం జరుగుతుందన్నారు. అందువల్ల డీలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రేషన్ డీలర్ల వద్ద టెక్నికల్ సమస్య ఉండటం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సక్రమంగా అందడం లేదని తమ దృష్టికి వచ్చిందని, టెక్నికల్ సమస్యను పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ బియ్యం ప్రజలకు సక్రమంగా అందజేయకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఆయన తెలిపారు. తహసీల్దారు నెహ్రూబాబు మాట్లాడుతూ డీలర్లు అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉచిత వైద్య శిబిరం

- 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు
- అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఆపరేషన్లు

తెనాలి: పట్టణానికి చెందిన ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాకారుల కోసం ప్రత్యేకంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీసీ కాలనీలోని కళాకారుల సంఘం భవనంలో జరిగిన శిబిరంలో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అనుబంధంగా గూడవల్లిలో గల డాక్టర్ కొమ్మారెడ్డి రాజారామమోహనరావు నేత్రవైద్య కేంద్రానికి చెందిన వైద్యసిబ్బంది కంటి పరీక్షలు చేశారు. దాదాపు రెండువందల మంది కళాకారులు పాల్గొన్నారు. ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ వైద్యపరీక్షలు చేయించుకున్నవారిలో అవసరమైన వారికి పదిరోజుల్లో కళాకారుల సంఘం తరపున ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని చెప్పారు. శుక్లాల ఆపరేషనును ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఈదర రామారావు ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ, వైద్యశిబిరంతో కళాకారులకు సేవ చేయడం అదృష్టంగా చెప్పారు. వైద్యసిబ్బంది వి.వెంకట్, నవీన్, రంజిత్, సుచిత్ర పరీక్షలు చేశారు. కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి మేరిగ రామలింగేశ్వరరావు, కోశాధికారి దీపాల సుబ్రహ్మణ్యం చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, దేవరపల్లి భవాని, కనపర్తి మధుకర్, రోటరీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమాదేవి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగి ముక్కాల వీరయ్య ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందులను సక్రమంగా వాడకుంటే క్షయ పూర్తిగా తగ్గే అవకాశం ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లెకొండ రవికమార్, మలేరియా అధికారులు అందె బాలచంద్ర మౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

మండల విద్యాశాఖాధికారి శోభా చందు



అమర్తలూరు(వేమూరు): పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని మండల విద్యాశాఖాధికారి శోభా చందు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదనపు క్లాసులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరు మంచి మార్కులు సాధించాలని సూచించారు. మండలంలోని 241 మంది విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడం జరుగుతుందని, ప్రతి పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహించడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి-1 కనపాల రమేష్, గణిత ఉపాధ్యాయులు విజయలక్ష్మి, డి.శ్రీనివాసరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చెరుకుపల్లి: కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని కావూరు బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాక్టస్ సంస్థలో పనిచేస్తున్న ఓటర్లను రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు తనిఖీ



వేమూరు: రేషన్ బియ్యం ప్రజలకు సక్రమంగా అందజేయాలని తహసీల్దారు సుశీల పేర్కొన్నారు. మండలంలోని జంపని గ్రామంలో రెండు షాపులు, చంపాడు గ్రామంలో ఒక షాపు, వేమూరులో రెండు షాపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని డీలరు షాపులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. రేషన్ బియ్యం పంపిణీపై అవకతవకలు జరిగితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రేషన్ డీలర్లందరు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలు



భట్టిప్రోలు (కొల్లూరు): ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇరువురు వ్యక్తులు గాయాల బారిన పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెల్లటూరుకు చెందిన తుళ్లూరి గోపి తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో కొల్లూరు మండలం కోటిపల్లికి చెందిన జెట్టి సంపత్‌కుమార్ మరో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తున్న క్రమంలో వాహనాల స్పీడ్‌ను అదుపుచేయడంలో ఇరువురూ విఫలమవ్వడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. వెల్లటూరు శివారు ప్రాంతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో గోపి, సంపత్‌కుమార్‌లు ఇరువురూ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు. భట్టిప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

పార్వతీ అమ్మవారికి సామూహిక అభిషేకాలు



భట్టిప్రోలు (కొల్లూరు) : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పార్వతీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో పార్వతీ అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సామూహిక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో తూనుగుంట్ల నాగసుధారాణి పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



తాళం పగులగొట్టిన హుండీ

కొల్లూరు : ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు శివారు యాదవపాలెం గ్రామం వెలుపల నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం తాళాలు పగులగొట్టి దుండగులు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయం గర్భగుడి తాళాలు సైతం పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన సుమారు రూ.45 వేలు విలువ చేసే స్వామి వారి వెండి అభయహస్తం, హుండీ తాళం పగులగొట్టి హుండీలోని కానుకలను తస్కరించారు. అర్ధరాత్రి ఆలయానికి సమీపంలోని పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి ఆటోను ఆపి ఉంచడాన్ని గమనించిన స్థానికులు ఎవరని అతనిని ప్రశ్నించారు. ఆయిల్ అయిపోవడంతో ఆగిపోవాల్సి వచ్చిందని, తమకు చెందిన వ్యక్తులు ఆయిల్ కోసం వెళ్లారని ఆటోలో ఉన్న వ్యక్తి బదులివ్వడంతో వారు కొల్లూరు వైపుకు వెళ్లిపోయారు. అనంతరం కొద్ది సమయానికే ఆటో తిరిగి వెళ్లిపోవడంతో ఆటోలో వచ్చిన వ్యక్తులే దొంగతనానికి పాల్పడి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో మొక్కజొన్న పొలంకు నీరు పెట్టుకొని వస్తున్న రైతు ఆలయం తలుపులు తీసి ఉండటం గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించడంతో పరిశీలించిన కమిటీ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఆలయంలో చోరీపై కమిటీ సభ్యులు కొల్లూరు పోలీసులను ఆశ్రయించినప్పటికీ పోలీసులు స్పందించలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాల కోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం



బాల కోటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అమర్తలూరు(వేమూరు): బాల కోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని దేవస్థానం అర్చకులు స్వర్ణ శ్రీనివాస శర్మ తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పురస్కరించుకుని మంగళవారం రాత్రి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నెల 26న గోవాడ గ్రామంలో బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మహా శివరాత్రి ముందు నిర్వహించే బాల కోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి పావులూరు రమేష్, దంపతులు స్వామి వారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక వ్యాఖ్యానితులుగా ప్రపంచ భారతి బిరుదాంకితులైన వేదాంతం సునీత, వేదాంతం బద్రీనాథ్ ప్రత్యేకమైన వ్యాఖ్యానాన్ని చేస్తూ కల్యాణ ఘట్టాలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చావలి శ్రీధర్ శర్మ, దేవస్థానం ఈవో బి.అశోక్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రేపు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల ప్రథమ వార్షికోత్సవం

తెనాలి: పట్టణంలోని శతవసంతాలకు పైగా సంస్కృత విద్యను అందించిన కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రథమ వార్షికోత్సవం ఈనెల 16న తెనాలిలో జరగనుంది. కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ హాలులో ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఆరంభమయ్యే వార్షికోత్సవం ఆహ్వానపత్రికను బుధవారం అక్కడే ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు. సంఘ బాధ్యులు సి.వి నాయకరావు మాట్లాడుతూ వందేళ్లకు పైగా ఎందరో పండితులను తీర్చిదిద్దిన సంస్కృత పాఠశాల పూర్వవిద్యార్థులం గతేడాది ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నట్టు గుర్తుచేశారు. ఆనాటి నిర్ణయం ప్రకారం పూర్వవిద్యార్థులు తమ వివరాలు, అనుభవాలు, జ్ఞాపకాలను 'మనోరమ' పేరుతో ప్రత్యేక సంచికను తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రఖ్యాత ఆగమశాస్త్రకోవిదుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి వార్షికోత్సవ వేడుకల్లో మనోరమ పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని చెప్పారు. కాలేజీకి ప్రిన్సిపాల్‌గా చేసిన ప్రఖ్యాత ప్రవచనకర్త బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, పూర్వవిద్యార్థులంతా హాజరుకావాలని కోరారు. మరో పూర్వవిద్యార్థి దేవయజనం మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్కృత కళాశాలలో 'మనోరమ' పేరుతో వార్షికోత్స రాతపత్రిని తీసుకొచ్చేవారమని గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థుల ప్రత్యేక సంచికకు అదే పేరుతో నామకరణం చేశామని తెలిపారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో సీహెచ్ రామలింగేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, లక్కరాజు లక్ష్మణరావు, మేడూరి శ్రీనివాసమూర్తి, ఆమంచి సూర్యనారాయణ పాల్గొన్నారు.

15న జరిగే సోర్స్–రిసోర్స్ కార్యక్రమంలో పాల్గొనాలి



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన సోర్స్ – రీసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డూలో బుధవారం సాయంత్రం ఆరోగ్య విభాగ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ప్రతి నెల 3వ శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజలు వీటిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలాలు మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రోడ్లపై ప్రజలు చెత్తను వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, నగరదీపికలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



భట్టిప్రోలు (కొల్లూరు) : పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు అనుమానాలను నివృత్తి చేయడంపై దృష్టి సారించినట్లు టీఎం రావు పాఠశాల హెచ్‌ఎం రామకోటేశ్వరరావు అన్నారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలను పంపిణీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలలో రాణించి ఉత్తమ మార్కులు సాధించడానికి విద్యాజ్యోతి పుస్తకం ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. విద్యార్థులు సైతం భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి పదో తరగతి పరీక్షలకు కష్టపడి సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

తెనాలిరూరల్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి. శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనని రకాల సివిలు, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బహిరంగ మద్యపాన ప్రియులకు జరిమానా

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. తెనాలి టూ టౌన్ సీఐ రాముల నాయక్ ఈ నెల 10వ తేదీన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందిపై కేసులు నమోదు చేశారు. అలానే మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు నుండి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందికి రూ. వెయ్యి చొప్పున, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు.

పన్నుల వసూలుకు సహకరించండి



భవన యజమానితో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మిపతిరావు

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థల, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతిరావు సూచించారు. పన్నుల వసూల్లో భాగంగా సుల్తానాబాద్‌లో బుధవారం ఆయన పర్యటించారు. పన్నులు చెల్లించని వారిని కలిసి వాటిని చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పన్నుల వసూలును వేగవంతం చేశామని తెలిపారు. ఉద్యోగులకు అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.